# బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి

## కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర

కామారెడ్డి, బతుకమ్మ :జిల్లాలో నమోదవుతున్న ప్రతి కేసును నాణ్యమైన దర్యాప్తుతో చట్టపరమైన గడువులోపు పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సీసీటీఎన్ఎస్ ద్వారా జిల్లాలో నమోదైన కేసుల పురోగతి, నేర నియంత్రణ చర్యలు, దర్యాప్తు పనితీరుపై నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు, సకాలంలో చార్జిషీట్లు దాఖలు చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0 అమలులో భాగంగా నమోదయ్యే ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను నిర్దేశిత గడువులోపు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఎలాంటి పేండెన్సీ లేకుండా ఎప్పటికప్పుడు నవీకరించాలని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలు, మట్కా జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో బస్సులు, అనుమానాస్పద వాహనాలు, కీలక ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పగలు, రాత్రి బీట్ వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేయాలని, రౌడీ షీటర్లు,




సస్పెక్ట్ షీటర్లపై తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అవకాశం లేకుండా చూడాలని ఎస్పీ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదలు, భారీ వర్షాలు, ఇతర అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో కలిసి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, అధిక వేగంతో వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల



ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు భంగం కలిగించే పోస్టులు, తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో అందుబాటులో ఉన్న సిబ్బందికి అనుగుణంగా డ్యూటీ రోస్టర్‌ను రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని, సిబ్బందిపై అధిక పనిభారం పడకుండా విధులను సమతుల్యంగా కేటాయించాలని ఎస్పీ ఆదేశించారు. డ్యూటీ రోస్టర్‌ను కచ్చితంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ కె. నరసింహారెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ప్రత్యేక విభాగాల అధికారులు, జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారంను బీఎల్ఓకు అందజేసిన కలెక్టర్

## ఈ నెల 24 లోపు ఎన్యూమరేషన్ ఫారంలు అందించాలి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తన ఎన్యూమరేషన్ ఫారంను బీ.ఎల్.ఓకు అందజేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అయిన జూన్ 25వ తేదీన బీఎల్ఓ, సూపర్వైజర్ లు కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ (నివాసానికి)కు వచ్చి రెండు ఎన్యూమరేషన్ ఫారంలను అందజేసి వెళ్ళారు. వాటిని పూర్తి వివరాలతో నింపిన అనంతరం కలెక్టర్ గురువారం సాయంత్రం బీఎల్ఓ కు ఫోన్ ద్వారా సమాచారం అందించి క్యాంప్ కార్యాలయానికి పిలిపించుకుని



వివరాలతో నింపిన ఎన్యూమరేషన్ ఫారం అందజేశారు. మరో ఎన్యూమరేషన్ ఫారంపై బీఎల్ఓ సంతకం చేసి ఎక్ నాలెడ్జ్ మెంట్ రూపంలో కలెక్టర్ కు అందించారు. ఎన్యూమరేషన్ ఫారం స్వీకరించినట్లుగా ఆన్ లైన్ ద్వారా బీ.ఎల్.ఓ మొబైల్ యాప్ లో అప్ డేట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం అమలు చేస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణలో అందరూ పాలొనాలని ఓటర్లను కోరారు. ఈ నెల 24వ తేదీ నాటితో గడువు ముగియనున్నందున, ప్రతి ఓటరు నిర్దేశిత గడువు లోపు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారంను నింపి బీ.ఎల్.ఓ కు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వినయ్ సాగర్, బీ.ఎల్.ఓ రుక్మిణి, సూపర్వైజర్ హరీష్ రెడ్డిలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతల చేతగానితనం వల్ల జిల్లా నష్టపోతుంది

## దమ్ముంటే రాజీనామా చేసి ఆర్మూర్‌లో పోటీ చేయు

## పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పై ఎమ్మెల్యే పైడి రాకేష్ ఫైర్

నిజామాబాద్, బతుకమ్మ : కాంగ్రెస్ నాయకుల చేతగానితనం వల్లే నిజామాబాద్ నష్టపోతుందని, ఢిల్లీలో పైరవీలు పదవులు తెచ్చుకోవడం కాదు జిల్లా అభివృద్ధికి ఏం చేశామని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఫైర్ అయ్యారు. గురువారం బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయంలో పైడి రాకేష్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాల్లో ఎన్నికల్లో పోటీ చేసి గెలువని మహేష్ కుమార్ గౌడ్ దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి గెలువాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ కు చెందిన నాయకులు రాష్ట్రంలో పెద్ద పదవులు ఉన్నా జిల్లాకు ఒరిగిందేమి లేదని, ఆర్మూర్ లో ఫామ్ అయిల్ ఫ్యాక్టరి ఏర్పాటుకు కసరత్తు చేస్తుంటే కొడంగల్ కు తరలించడమేమిటని మండిపడ్డారు. నిజామాబాద్ జిల్లా ప్రజలకు ఎన్నో రోజుల నుంచి ఎదురు చూస్తున్న చక్కర ఫ్యాక్టరిని తెరిపించలేని అసమర్థులు కాంగ్రెస్ నాయకులని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు చౌకబారు విమర్శలు చేయడం తప్పితే అభివృద్ధి చేయడం చేతగాదని పైడి రాకేష్ రెడ్డి అన్నారు. సీఎం పదవి ఉంటుందో ఊడుతుందో తెలియని రేవంత్ రెడ్డికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పై విమర్శలు చేసే అర్హత లేదన్నారు. కార్యకర్త నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రపంచంలో అతిపెద్ద పార్టీకి జాతీయ అధ్యక్షుడు అయిన నితిన్ ను విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదన్నారు.




ప్రతీసారి కేంద్రం నిధులు ఇవ్వడం లేదని విమర్శించడం తప్ప తెలంగాణ ప్రజలకు చేసిందేమి లేదని విమర్శించారు. తెలంగాణలో ప్రజలు ముఖ్యంగా యువత పొట్ట చేతపట్టుకుని గల్ఫ్ పట్టినా వారికి ఉపాధి చూపించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఆడబిడ్డలు బీడీ పరిశ్రమను నమ్ముకుంటే వారి బ్రతుకులు పొగచురుతున్న పట్టించుకునే నాథుడే లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ గొప్పగా చెబుతున్న యూరియా యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని రాకేష్ రెడ్డి విమర్శలు చేశారు.

ఈ విలేకరుల సమావే శంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు బొబ్బి వేణు గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ళ లక్ష్మీనా రాయణ, స్వామి యాదవ్, ఆమందు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్స్ డే సందర్భంగా డా. కవితా రెడ్డికి ఘన సన్మానం



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :జాతీయ వైద్యుల దినోత్సవం (డాక్టర్స్ డే) సందర్భంగా నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రాములు, ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కలిసి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డా. కవితా రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆరోగ్య రంగంలో ఆమె అందిస్తున్న సేవలు, ప్రజారోగ్యాభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ సన్మానం అందజేశారు. ఈ సందర్భంగా డా. కవితా రెడ్డి మాట్లాడుతూ తనకు ఈ గౌరవం అందించిన సూపరింటెండెంట్ డా. రాములు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వైద్య వృత్తి అత్యంత గొప్పదని, ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యతను నిర్వర్తిస్తున్న ప్రతి వైద్యుడు సమాజానికి ఆదర్శమని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పరస్పరం డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలుపుకుంటూ వైద్య సేవలను మరింత మెరుగుపర్చేందుకు కృషి చేయాలని సంకల్పించారు.

# నాగారం బస్తీ దవాఖానలో ఐఐహెచ్ఎఫ్ డబ్ల్యూ చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డా. కవితా రెడ్డి గురువారం నిజామాబాద్ నగరంలోని నాగారం బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు మరియు సిబ్బంది హాజరు, రోగులకు అందిస్తున్న



చికిత్స, మందుల లభ్యత, పరిశుభ్రత, మౌలిక వసతులను ఆమె పరిశీలించారు. తనిఖీ సందర్భంగా డా. కవితా రెడ్డి ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైద్య సేవల నాణ్యత, రోగులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలను సేకరించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బి. రాజశ్రీతో కలిసి దవాఖానలో అందుతున్న సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సంస్థల్లో సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు, రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని డా. కవితా రెడ్డి అధికారులను ఆదేశించారు.

# భూ భారతి భూముల రీ-సర్వేపై అవగాహన సదస్సు



భీంగల్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలం పరిధిలోని బాబాపూర్ గ్రామంలో బుధవారం భూ భారతి భూముల రీ-సర్వేపై రైతులు, భూ యజమానులకు అవగాహన కల్పించే ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రీ - సర్వే ప్రక్రియ ద్వారా భూముల హద్దులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖచ్చితంగా నిర్ధారించి, భూ రికార్డులను పారదర్శకంగా రూపొందించనున్నట్లు తెలిపారు. భూములకు సంబంధించిన సందేహాలు, అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు రీ-సర్వే సమయంలో పూర్తిగా సహకరించాలని, అవసరమైన భూ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు కోరారు. ఈ రీ-సర్వే ద్వారా భూ వివాదాలు తగ్గి, ఖచ్చితమైన రికార్డులు రూపొందించడంలో సహాయపడుతుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, రైతులు, భూ యజమానులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.